క్లుప్తంగా

బీఆర్ఎస్‌తోనే సమన్యాయం

మాజీ డిప్యూటీ మేయర్ విక్రంరెడ్డి



రంజాన్ కానుకలు పంపిణీ చేస్తున్న విక్రంరెడ్డి, అనిల్‌యాదవ్

మీర్‌పేట: బీఆర్ఎస్ పాలనలోనే అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరిగిందని డిప్యూటీ మేయర్ తీగల విక్రం రెడ్డి అన్నారు. గురువారం జిల్లెలగూడ పాశ్‌కాలనీ మసీదు వద్ద మీర్‌పేట ఎంపీటీసీ మాజీ సభ్యుడు, కార్పొరేటర్ ఏనుగు అనితా అనిల్ యాదవ్ ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ కానుకలు అందజేశారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన విక్రంరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మైనార్టీలకు పెద్దపీట వేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నవీన్‌గౌడ్, రజాక్, నాయకులు బీరప్ప, శ్రీనునాయక్, అంజయ్య, యాదగిరి, సునీత, మహ్మద్‌అలీ, గుంషావళి, గులామ్, మహ్మద్, బషీరాబి తదితరులు పాల్గొన్నారు.

లార్డ్స్‌లో క్రీడోత్సవం



చిన్నారులతో యాజమాన్యం

బడంగ్‌పేట్: లార్డ్స్ పాఠశాలలో గురువారం క్రీడోత్సవం నిర్వహించారు. ప్రాథమిక విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రైమరీ విద్యార్థులు నిర్వహించిన ప్రయోగాలు, ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల చైర్మన్ బీరప్ప మాట్లాడుతూ. చిన్నప్పటి నుంచి విద్యార్థులకు ప్రదర్శన, ప్రయోగాలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్‌లో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులకు వినూత్న విద్యావిధానాన్ని(క్రీడో) అవలంబిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపాల్ సంతోష్, ఇన్‌చార్జి రేఖా సాగర్, ఉపాధ్యాయులు ఉన్నారు.

వడ్డీపై 90 శాతం రాయితీ

జల్‌పల్లి కమిషనర్ వెంకట్రామ్



పహాడీషరీఫ్: ఆస్తి పన్ను వడ్డీ బకాయిలు వన్ టైం సెటిల్‌మెంట్ కింద కల్పిస్తున్న 90 శాతం రాయితీని యజమానులు సద్వినియోగం చేసుకోవాలని జల్‌పల్లి మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ సూచించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను వసూలు చేసేందుకు బిల్ కలెక్టర్లతో పాటు వార్డు ఆఫీసర్లు, సహాయక సిబ్బంది వార్డుల వారీగా పర్యటిస్తున్నారన్నారు. ఆస్తి పన్ను చెల్లింపునకు మూడు రోజులే గడువు ఉన్నందున, చెల్లించని వారు వెంటనే చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటికే వడ్డీతో సహా చెల్లించిన యజమానులకు, 2025–26 ఆర్థిక సంవత్సరంలో ప్రాపర్టీ ట్యాక్స్ డిమాండ్‌లో సర్దుబాటు అవుతుందని ఆయన వివరించారు.

లేమూరులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కందుకూరు: మండల పరిధిలోని లేమూరులో మైనార్టీ సంఘం మాజీ అధ్యక్షుడు నసీర్ అహ్మద్ ఆధ్వర్యంలో గురువారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు ఎమ్మెల్యే సబితారెడ్డి కుమారుడు బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్‌రెడ్డి హాజరయ్యాడు. బీఆర్ఎస్ మైనార్టీ ఉపాధ్యక్షుడు ఎండీ దావూద్, జిల్లా నాయకుడు మీనాక్షీ పటేల్, మహేశ్వరం మాజీ కోఆప్షన్ సభ్యుడు ఆదిల్, సయ్యద్‌ఇమ్రాన్, ప్రభాకర్, రియాజ్, ఇలియాస్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల జారీలో జాప్యం

ఇబ్బంది పడుతున్న దరఖాస్తుదారులు

షాద్‌నగర్ రూరల్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం దరఖాస్తులు చేసుకునేందుకు కావాల్సిన ధ్రువపత్రాల కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కులం, ఆదాయం ధృవపత్రాల కోసం మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకుని పడిగాపులుకాస్తున్నారన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లోనూ సర్వర్ల పని చేయకపోవడంతో సమస్య మరింత జటిలమవుతుందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సర్వర్ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

ప్రైవేటు బడుల ప్రచార జోరు

- విద్యా సంవత్సరం ముగియక ముందే ఇంటింటికీ ఉపాధ్యాయులు
- తక్కువ ఫీజుతో డిజిటల్ బోధనంటూ ఆకర్షించే యత్నం
- ఆటోలు, సైకిళ్లకు ఫ్లెక్సీలతో పబ్లిసిటీ



ఆటోల ద్వారా ప్రచారం

పహాడీషరీఫ్: ప్రస్తుత 2024– 25 విద్యా సంవత్సరం ముగియక ముందే ప్రైవేట్ పాఠశాలల ప్రచారం జోరందుకుంది. 'మా స్కూల్‌లో అనేక వసతులు కల్పిస్తున్నామని, డిజిటల్ బోధన చేస్తున్నామని' వివరిస్తూ.. అడ్మిషన్లకు తెరతీశాయి. ఇంటింటికీ ఉపాధ్యాయులు తిరుగుతూ.. 'మా బడిలో తక్కువ ఫీజు తీసుకుంటున్నాం. ప్రత్యేక తరగతులతో చిన్నారులను తీర్చిదిద్దుతున్నాం. మీ పిల్లలను పంపండంటూ' తల్లిదండ్రులను కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. 'ప్రైవేటు పాఠశాలలు ఎక్కువగా ఫీజులు దండుకుంటున్నాయని, తక్కువ ఫీజు అని చెబుతూ.. తీరా పిల్లలను చేర్పించాక అసలు కథ మొదలవుతుందని' పలువురు పేర్కొంటున్నారు. ఇదని అదని ఇష్టానుసారంగా డబ్బులు గుంజుతారని వాపోతున్నారు.

లోపభూయిష్టం

జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధి పాఠశాలల యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయి. అరకొర వసతులు కల్పిస్తూ ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. అర్హత లేని ఉపాధ్యాయులతో విద్యా బోధన చేయిస్తూ లోపభూయిష్ట విద్యా విధానాన్ని అవలంభిస్తున్నారు. బీఈడీ, డీఈడీ, టీటీసీ చేసిన వారితో పాఠశాలను కొనసాగాల్సి ఉన్నప్పటికీ.. అవేమి పట్టించుకోవడం లేదు. పాఠశాలల్లోనే పుస్తకాలు, యూనిఫారంలు, బూట్లు, స్టేషనరి తదితర వాటిని విక్రయిస్తూ విద్యను వ్యాపారంగా మారుస్తున్నారు. ఒక్కో విద్యార్థి పుస్తకాలకే రూ.6 నుంచి 10 వేల వరకు గుంజేస్తున్నారు. కాన్సెప్ట్, టెక్నో, టాలెంట్ లాంటి పేరు చివర తోకలను తగిలిస్తూ.. నిబంధనలకు విరుద్ధంగా విద్యాలయాలను కొనసాగించడం విశేషం.

ఇష్టానుసారంగా ఫీజులు

మండల పరిధిలోని మెజార్టీ పాఠశాలల ఫీజులకు అడ్డూఅదుపులేకుండా పోయింది. రూ.15 వేల నుంచి 50 వేల వరకు ఒక్కో విద్యార్థి నుంచి వసూలు చేస్తున్నారంటే పరిస్థితి ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఈ స్థాయిలో వసూళ్లకు పాల్పడుతూ.. ఒక్కో విద్యార్థికి నెలకు రూ.400–500లు మాత్రమే తీసుకుంటున్నట్లు వాటి యాజమాన్యాలు విద్యాశాఖకు లెక్కలు సమర్పిస్తున్నట్లు సమాచారం . ఈ పాఠశాలల్లో నర్సరీ విద్యార్థులకు రూ.10 వేల నుంచి 20 వేలు వసూలు చేస్తుండడంతో తల్లిదండ్రులు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నారు. విద్యాలయాలు వ్యాపార కేంద్రాలుగా మారడంతో వచ్చే వేతనం ఫీజులకే సరిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి పాఠశాలలో ఫీజు స్ట్రక్చర్‌కు సంబంధించి బోర్డును ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, ఫీజులపై నియంత్రణ తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు. ఇక అకాడమీ ఇయర్ పూర్తికాకముందే చిన్నారులను పాఠశాలలో చేర్పించుకునేందుకు టీచర్లను గడపగడపకు తిప్పడంతో పాటు, ఆటోల ద్వారా ప్రచారం విస్తృతంగా కొనసాగిస్తున్నారు.

అధికారుల తీరుపై అనుమానాలు

ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నా.. విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. గుర్తింపులేని పాఠశాలలతో పాటు, అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్న బడులపై చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఆయా యాజమాన్యాలతో కుమ్మక్కయ్యారని ఆరోపిస్తున్నారు.

సౌకర్యాలు నిల్

మండల పరిధిలో అత్యధిక పాఠశాలలను అతి తక్కువ విస్తీర్ణంలో, ఎలాంటి సదుపాయాలు లేకుండా కొనసాగిస్తున్నట్లు సమాచారం. వెంటిలేషన్, లైటింగ్, మూత్రశాలలు, తాగునీరు, ఫర్నిచర్, మైదానం, తరగతి గదులలో అగ్నిమాపక పరికరాలు ఉండాల్సి ఉంటుంది. కానీ ఇలాంటి సదుపాయాలు సగానికి పైగా పాఠశాలల్లో కనిపించని పరిస్థితి నెలకొంది. తరగతి గదుల్లోకి సూర్యకాంతి కనిపించే దాఖలాలే ఉండవు. ఈ కారణంగా కూడా విద్యార్థులు అనారోగ్యానికి గురయ్యే అవకాశం కూడా ఉంది.

బీజేపీ పాలనపై కాంగ్రెస్ పోరు

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్

తుక్కుగూడ: దేశంలో అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్న బీజేపీపై కాంగ్రెస్ పోరుకు సిద్ధమైందని పల్లె, పల్లెన జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమ ఇన్‌చార్జి వినోద్, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ తెలిపారు. గురువారం మున్సిపల్ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం, అంబేడ్కర్‌పై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా సహా బీజేపీ చేస్తున్న అంతర్గత దాడి, దేశాన్ని ముక్కలు చేసే కుట్రలపై కాంగ్రెస్ ఉద్యమం చేపట్టిందన్నారు. స్వాతంత్య్ర పితమహుడు గాంధీ జీని, రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను దేశం పూర్తిగా మరిచిపోయేలా చేస్తుందన్నారు. ఇందుకు పార్టీ ఏప్రిల్ 2 నుంచి దేశ వ్యాప్తంగా ప్రతీ పల్లె, ప్రతీ ఇంటికి జైబాపు, జైభీమ్ నినాదం తీసుకువెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, బడంగ్‌పేట కార్పొరేషన్ మాజీ మేయర్ పారిజాత, నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణానాయక్, చాకలి యాదయ్య, గోవర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రావు, శివగళ్ల యాదయ్య, నాగేందర్‌రెడ్డి, సుభాన్ యాదవ్, శ్రీధర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విలీనంతో అన్నివిధాలా అభివృద్ధి

మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి



ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని జేఏసీ చైర్మన్, సభ్యులకు అందజేస్తున్న గంగారం గ్రామస్తులు

మహేశ్వరం: ఫ్యూచర్ సిటీలో గ్రామాలను విలీనం చేస్తే అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి అన్నారు. గురువారం ఆయన మండల పరిధిలోని గంగారం, సిరిగిరిపురం గ్రామాల్లో ఫ్యూచర్ సిటీ జేఏసీ నాయకులు గ్రామాల విలీనంతో జరిగే లాభనష్టాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల విలీనమైతే ఈ ప్రాంతంలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పెరిగి మరో హైటెక్ సిటీగా మారుతుందన్నారు. మండల పరిధిలోని 28 పంచాయతీలు ఫ్యూచర్ సిటీలో విలీనం చేయడానికి ప్రజలు పూర్తి అంగీకారంతో ఉన్నారన్నారు. గంగారం గ్రామంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు తమ గ్రామాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేసి జేఏసీ చైర్మన్, సభ్యులకు పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ ప్రధాన కార్యదర్శి, గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్, జేఏసీ నాయకులు కె.చంద్రయ్య, యాదీష్, అంధ్యా నాయక్, పాండు నాయక్,, యాదయ్య గౌడ్, దేశ్యా నాయక్, రమేష్, నర్సింహ యాదవ్, సుదర్శన్ యాదవ్, వీరా నాయక్, సూర్యా నాయక్, దయ్యాల శ్రీను, నర్సింహ గౌడ్, టి.యాదయ్య, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నిట్ వరంగల్ ప్రొఫెసర్ వేణుగోపాల్



కార్యక్రమంలో పాల్గొన్న ప్రొఫెసర్ వేణుగోపాల్

మొయినాబాద్: సాంకేతిక రంగ విద్యార్థులు విద్యతోపాటు క్రీడలు, సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలని వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) ప్రొఫెసర్ వేణుగోపాల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని కేజీరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులపాటు ఇన్విక్టా–2025 పేరుతో సాంస్కృతిక, క్రీడా ఉత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో వివిధ ప్రాంతాల నుంచి 48 కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడల్లో పాల్గొనడంతో మేధాశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రోహిత్ కందకట్ల, ప్రిన్సిపల్ సాయి సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పండుగలు ఐక్యతకు ప్రతీక

మాజీ ఎంపీపీ రవీందర్ యాదవ్

షాద్‌నగర్: రంజాన్ మతసామరస్యానికి ప్రతీక అని మాజీ ఎంపీపీ రవీందర్‌యాదవ్ అన్నారు. రంజాన్ సందర్భంగా గురువారం మున్సిపల్ పరిధిలోని బీఆర్ఎస్ 10వ వార్డు అధ్యక్షుడు చెర్కు శివ ఆధ్వర్యంలో ఈద్గా వద్ద ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవీందర్ యాదవ్ హాజరై మాట్లాడుతూ.. పండుగలు ఐక్యతకు ప్రతీకలు అన్నారు. యువత సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎంఎస్ నట్‌రాజ్, నాయకులు యుగేందర్, శేఖర్, శంకర్, రవి, అద్దు, చిన్న, యాదగిరి, సాధిక్, బిలాల్, అశ్రఫ్, అజహర్, నిజాం, మహమూద్, భిక్షపతి, సందీప్, రాఘవేందర్, పవన్‌సింగ్, నవీన్, వినోద్, సాయి యాదవ్, శ్రీశైలం, మల్లేష్, మధు, రాజశేఖర్, పాండు, మూర్తి, రఘు పాల్గొన్నారు.

పన్నులు చెల్లిస్తేనే మున్సిపల్ అభివృద్ధి

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి



పన్ను చెల్లిస్తున్న జైపాల్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు పన్నులు చెల్లించాలని ఇది మన అందరి బాధ్యత అని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొత్త జైపాల్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో ఆస్తిపన్నులు విధిగా చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, రెవెన్యూ అధికారి జమిల్ అహ్మద్, బిల్ కలెక్టర్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వం పాలన నుంచి వైదొలగాలి'

కొందుర్గు: పాలన చేతగాని ప్రభుత్వం వెంటనే పాలన నుంచి వైదొలగాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర నాయకుడు భూపాలాచారి అన్నారు. గురువారం ఆయన్ను చౌదరిగూడ పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఈ సందర్భంగా భూపాలాచారి మాట్లాడుతూ.. సర్పంచ్‌ల పదవీకాలం పూర్తయి 15 నెలలు గడిచినా తాము చేపట్టిన అభివృద్ధి పనులకు బిల్లులు ఇవ్వకపోవడం సరికాదన్నారు. ప్రజాస్వామ్య యుతంగా ఉద్యమానికి పిలుపునిస్తే గృహనిర్బంధం చేయడం సరికాదన్నారు.

నాయకుల ముందస్తు అరెస్టు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులను విడుదల చేయకపోవడంతో మాజీ ప్రజాప్రతినిధులు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చారు. ఈమేరకు ఆయా గ్రామాల్లో మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేశారు. గురువారం నక్కలపల్లి మాజీ సర్పంచ్ స్వప్న భర్త అంజయ్యగౌడ్‌ను గృహనిర్బంధం చేశారు.

సొంత ఖర్చుతో విద్యుత్ మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కొత్తూరు: మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డులో ఒకే స్తంభానికి రెండు భాగాలుగా ఏర్పాటు చేసిన విద్యుత్ తీగల కారణంగా ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు కౌన్సిలర్ హేమాదేవేందర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు స్పందించిన ఆమె గురువారం ట్రాన్స్‌కో, మున్సిపల్ సిబ్బందితో కలిసి సొంత ఖర్చుతో ప్రమాదాలు జరగకుండా మరమ్మతులు చేయించారు. గతంలో గాలులు, వర్షాల కారణంగా టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఇతర గృహోపకరణాలు కాలిపోయినట్లు వివరించారు. తమ సమస్యను చెప్పగానే స్పందించి పరిష్కరించిన కౌన్సిలర్‌ను వార్డు వాసులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవేందర్‌ముదిరాజ్, ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చిన సర్టిఫికెట్లకు కబ్జా చూపండి

ఆర్డీఓ చాంబర్‌లో బైఠాయించి లబ్ధిదారుల నిరసన



ఆర్డీఓ చాంబర్‌లో బైఠాయించి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, లబ్ధిదారులు

కందుకూరు: ఇచ్చిన సర్టిఫికెట్లకు సంబంధించి ఇళ్ల స్థలాలకు కబ్జా చూపాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఆర్డీఓ కార్యాలయంలోని ఆర్డీఓ చాంబర్‌లో లబ్ధిదారులు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. 2007, 2023 సంవత్సరాల్లో కందుకూరు రెవెన్యూ సర్వే నంబర్లు 788, 107లలో అర్హులైన పేదలకు అప్పటి ప్రభుత్వాలు ఇళ్ల స్థలాలు కేటాయిస్తూ సర్టిఫికెట్లు జారీ చేసిందన్నారు. ఇంత వరకు ఇంటి జాగాను చూపలేదన్నారు. ఆ భూముల్లో గుడిసెలు వేసుకుని చేసిన పోరాటంతో పాటు ఎన్నోమార్లు వివిధ రూపాల్లో లబ్ధిదారుల తరఫున ఉద్యమాలు చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలం ఇవ్వలేని సర్కారు ఎందుకని ప్రశ్నించారు. సమస్య పరిష్కరించే వరకు కదిలేదిలేదన్నారు. కాగా ఏప్రిల్ 15 వరకు సమస్య పరిష్కరిస్తానని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి హామీ ఇవ్వడంతో వారు శాంతించి నిరసన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాస్, కుమార్, జి.శ్రీశైలం, నరసింహ, చందు, ఎస్.కృష్ణ, అంజయ్య, మహేందర్, సీఐటీయూ నాయకులు గాదె సత్యం, లబ్ధిదారులు జంగమ్మ, ఆండాలు, లక్ష్మమ్మ, అంజమ్మ, ఇందిరమ్మ, రఘు భాయ్, షాహినాబేగం, రాధా తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల అరెస్ట్ సరికాదు

పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్



కందుకూరు చౌరస్తాలో సీపీఎం నాయకుల ర్యాలీ

కందుకూరు: రామోజీ ఫిలింసిటీలో పేదల పక్షాన పోరాడుతున్న సీపీఎం నాయకుల అరెస్టు సరికాదని పార్టీ మండల కార్యదర్శి బుట్టి బాలరాజ్ అన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి శ్రీశైలం రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను ఆక్రమించుకుని రామోజీ ఫిలిం సిటీ నిర్వాహకులు ప్రహరీ సైతం నిర్మించారన్నారు. ఇందుకు నిరసనగా ఉద్యమం చేపట్టిన సీపీఎం రాష్ట్ర నాయకులు, లబ్ధిదారులపై లాఠీచార్జి చేసి అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్య అన్నారు. గతంలో తెలంగాణ సాయుధ పోరాటం నడిపి పది లక్షల ఎకరాల భూమి పంచిన చరిత్ర ఎర్ర జెండా నాయకత్వంకు ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం దిగివచ్చి పేదలకు న్యాయం చేయకపోతే ఉపేక్షించేది లేదన్నారు. గత ప్రభుత్వానికి పట్టిన గతే ప్రస్తుత ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుమార్, శ్రీనివాస్, కుమార్, చందు, శ్రీశైలం, నరసింహ, అంజయ్య, మహేందర్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పేరిట రోడ్ల ధ్వంసం

- పనులు పూర్తయ్యాక పట్టించుకోని కాంట్రాక్టర్లు
- మట్టి వేసి చేతులు దులుపుకొంటున్నారని ప్రజల ఆరోపణ
- రోడ్లు బాగు చేయాలని వినతి



లెనిన్‌నగర్ మురళీకృష్ణానగర్‌లోని రోడ్డు దుస్థితి



జిల్లెలగూడ అంబేద్కర్‌నగర్‌లోని రోడ్డు

మీర్‌పేట: అభివృద్ధి పనుల పేరిట తవ్వకాలు చేపట్టడం.. పనులు పూర్తయ్యాక తూతూ మంత్రంగా పూడ్చి వదిలేయడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని లెనిన్‌నగర్, అంబేడ్కర్‌నగర్‌లలో గతంలో డ్రైనేజీ, తాగునీటి పైపులైన్‌లు, ఇతర పనుల కోసం రోడ్లను అడ్డగోలుగా తవ్వడం, ఆ తరువాత పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు తిరిగి మరమ్మతులు చేపట్టకుండా వదిలేయడంతో రోడ్లు ధ్వంసమవుతున్నాయని బస్తీవాసులు వాపోతున్నారు. పనులు చేపట్టిన కాంట్రాక్టరే తిరిగి మరమ్మతులు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ తూతూ మంత్రంగా మట్టితో పూడ్చి చేతులు దులుపుకొంటుటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు సైతం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బస్తీవాసులు ఆరోపిస్తున్నారు. ఇలా చేయడం వల్ల రోడ్లు ధ్వంసమై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోందని పనులు పూర్తయ్యాక తిరిగి రోడ్లకు మరమ్మతులు చేపట్టేలా అధికారులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

న్యాయవాదులకు రక్షణ కరువు



ఇబ్రాయిల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

మహేశ్వరం: న్యాయం కోసం కొట్లాడే న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని మహేశ్వరం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరికిషన్ గౌడ్ అన్నారు. న్యాయవాది ఎర్రవాపు ఇబ్రాయిల్ హత్య కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి, సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇబ్రాయిల్ హత్యకు నిరసనగా.. గురువారం మండల కేంద్రంలోని మహేశ్వరం కోర్టు ఎదుట న్యాయవాదులు మూడో రోజు విధులను బహిష్కరించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరికిషన్ మాట్లాడుతూ.. ఇబ్రాయిల్‌ను హత్య చేసిన నిందితుడికి వెంటనే శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

వడ్డీ రాయితీని వినియోగించుకోవాలి

చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అశోక్

నందిగామ: రైతులు తమ రుణాలను సకాలంలో చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని చేగూరు పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ సూచించారు. మండల పరిధిలోని చేగూరులోని పీఏసీఎస్‌లో గురువారం మహా జనసభ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ అశోక్ మాట్లాడుతూ.. రైతులకు కావాల్సిన రుణాలను అందిస్తామని, గతంలో తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించాలని సూచించారు. వచ్చే సీజన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతామన్నారు. మొండి బకాయిల వసూలు, సభ్యత్వ నమోదును ప్రక్రియ విషయాలను సంఘం సభ్యులతో చర్చించారు. సంఘం ఆర్థిక లావాదేవీల టర్నోవర్ సుమారు రూ.10 కోట్లు ఉందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మున్నూరు పద్మారావు, సీఈఓ వెంకటయ్య, డైరెక్టర్లు బండి మల్లేష్, మర్రెడ్డి, పాండు, నర్సింలు, చంద్రశేఖర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం

షాద్‌నగర్: చలివేంద్రం ఏర్పాటు అభినందనీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెబాబయ్య అన్నారు. గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రంగంపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు పిట్టల సురేష్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ... వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షనీయమని అన్నారు. పార్టీ నాయకులు సేవా భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. సంపాదించిన దానిలో కొంత సమాజాభివృద్ధికి, పేదల కోసం ఖర్చు చేయాలన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పార్టీ నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి వెంకటేష్ గుప్తా, అశోక్, వంశీకృష్ణ, వెంకటేశ్, ప్రశాంత్, శ్రీనివాస్‌చారి, ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, గణేష్, సుధాకర్, రాజు నాయక్, పాపయ్య, లక్ష్మయ్య, అంజయ్యగౌడ్, శ్రీకాంత్, రవీందర్‌గౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.